సాక్షి నిర్మల్

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



బాలింత మృతి

నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. 8లో▸



చంపేశారు!? 8లో▸

రిమ్స్ బీఎస్సీ విద్యార్థి శనివారం అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. కొట్టి చంపారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆందోళన చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దేవాదాయ శాఖ మంత్రికి వినతి



మంత్రి కొండ సురేఖతో ఒడ్నాల రాజేశ్వర్

లక్ష్మణచాంద: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ హైదరాబాద్‌లో కలిశారు. మండలంలోని వివిధ గ్రామాలలో నిర్మించిన ఆలయాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

'అమృత్' పనులు పరిశీలించిన డీడీఎం



స్థలాన్ని పరిశీలిస్తున్న డీడీఎం పద్మావతి

ఖానాపూర్: పట్టణానికి అమృత్ 2.0 స్కీం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టే పనులను వరంగల్ డీడీఎం పద్మావతి శనివారం పరిశీలించారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ట్యాంకు నిర్మించే ప్రాంతాన్ని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో డీఎంవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి అజాం అలీ తదితరులు ఉన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

భైంసాటౌన్: ముధోల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భైంసా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, అర్థశాస్త్రం, కామర్స్, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 24లోగా భైంసాలోని డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 25న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ నిర్వహిస్తామని వెల్లడించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. 22న ఆదివారం సైతం కళాశాలలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 99633 08287 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సోలార్ పవర్‌పై ఉచిత శిక్షణ

భైంసాటౌన్: జాతీయ సోలార్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో 'సూర్యమిత్ర స్కిల్ డెవలప్‌మెంట్' పథకం కింద సోలార్ పవర్‌పై ఉచిత శిక్షణ అందించనున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ అమిత్ తెలిపారు. ఐటీఐ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఫిట్టర్, వెల్డర్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ డిప్లమా పూర్తిచేసిన 18–30 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో అక్టోబర్ 1 నుంచి మూడు నెలలు ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం సోలార్ సంబంధ కంపెనీల్లో ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99085 56640, 83338 37632 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

జూనియర్ లెక్చరర్ల జిల్లా కార్యవర్గం

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ జి.తుకారం, దిలావర్‌పూర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా జె.రవికిరణ్, ఉపాధ్యక్షుడిగా ఆనందం, ప్రధాన కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా నవీన్, సంయుక్త కార్యదర్శిగా టి.విష్ణువర్ధన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జి.సత్యపాల్‌రెడ్డి, జె.బలరాం, సందీప్ కులకర్ణి, మహిళా కార్యదర్శిగా విజయలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరశురాం అభినందించారు.



విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈశ్వర్



భైంసా ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

జ్వరాలతో విలవిల..!

- భైంసాలో ఇంటింటా బాధితులు
- 28 డెంగీ పాజిటివ్ కేసులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

భైంసాటౌన్: భైంసా పట్టణంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణంలో ఇంటింటా జ్వర బాధితులు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒంటి నొప్పులు, తీవ్రమైన జ్వరంతో చాలా మంది బాధపడుతున్నారు. మరోవైపు డెంగీ కేసులు భయపెడుతున్నాయి. ఒక్క భైంసా పట్టణంలోనే జూలై నుంచి ఇప్పటి వరకు 28 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రెండురోజుల క్రితం డెంగీ లక్షణాలతో ఓ యువతి మృతి చెందింది. దీంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రతీరోజు 600 ఓపీ..

ఏటా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సాధారణమే. అయితే, ఈసారి చికున్‌గున్యా విజృంభిస్తోంది. డెంగీ కేసులు కూడా అధికంగానే నమోదవుతున్నాయి. జ్వర లక్షణాలతో పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి ప్రతీరోజు 500 నుంచి 600 వరకు బాధితులు వస్తున్నారు. ఈనెలలో ఇప్పటివరకు 9వేల వరకు ఓపీ నమోదైంది. వీరిలో జ్వర పీడితులే ఎక్కువగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,185 మంది జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించగా, వీరిలో 208 మందికి డెంగీ పాజిటివ్ వచ్చింది. ఇందులో భైంసా పట్టణంలో 28 పాజిటివ్ కేసులు ఉన్నాయి.

మొక్కుబడిగా డ్రైడే..

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మున్సిపల్, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాలనీల్లో పర్యటిస్తూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా, పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. కూలర్లు, వాడేసిన టైర్లు, కొబ్బరిబొండాల్లో నీరు నిల్వ ఉండకుండా వారికి అవగాహన కల్పించాలి. మున్సిపల్ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో డ్రెయినేజీల్లో పూడికతీత, మురుగునీటి కుంటల్లో ఆయిల్ బాల్స్, దోమల నివారణకు ఫాగింగ్ తదితర చర్యలు చేపట్టాలి. డ్రై డే తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం...

పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. కార్మికులతో డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేయిస్తున్నాం. డ్రైడేలో భాగంగా కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– బి.రాజేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, భైంసా

జ్వరాలన్నీ డెంగీ కావు

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: వాతావరణంలో వచ్చిన మార్పులతో వైరల్ జ్వరాలు పెరుగుతున్నాయని, వాటి గురించి ఆందోళన చెందొద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ తెలిపారు. జ్వరాలన్నీ డెంగీ కావని అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం మాట్లాడారు. భైంసా పట్టణంలోని ఏపీ నగర్‌కు చెందిన ప్రీతి అనే విద్యార్థిని ఇతర అనారోగ్య కారణాలతో మరణించిందని తెలిపారు. ఆమె రక్త పరీక్ష నివేదిక ఆధారంగా ఆమెకు 1,56,000 ప్లేట్లెట్స్ ఉన్నాయని తెలిపారు. ఆమెకు డెంగీ నిర్ధారణ పరీక్ష చేయలేదని పేర్కొన్నారు. ఎలిసా పరీక్ష చేయకుండా డెంగీ నిర్ధారణ చేయవద్దని ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందకుండా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డెంగీ నిర్ధారణ జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ లో ఉచితంగా చేస్తారని తెలిపారు.

ఆ మిల్లులకు ధాన్యం కేటాయించొద్దు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: గతంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని రైసు మిల్లులకు ధాన్యాన్ని కేటాయించొద్దని, వానాకాలం వరి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్, సంబంధిత అధికారులు, మిల్లర్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని సూచించారు. రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. తూకం యంత్రాలకు స్టాంపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై ఫిర్యాదు కోసం కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యం జరుగకుండా రవాణా శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిల్లర్లు తమ రైస్ మిల్లులలో ధాన్యం నిల్వకు స్థలం సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో టెంటు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమపై శాస్త్రీయ అధ్యయనం చేయాలి



ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుపై చర్చిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఇథనాల్ పరిశ్రమతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాస్త్రీయ అధ్యయనం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులు, పరిశ్రమ ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలితోసహా సంబంధిత శాఖల నియమాలను పరిశ్రమ యాజమాన్యం కచ్చితంగా పాటించాలన్నారు. పరిశ్రమతో రైతులు, ప్రజలకు ఎటువంటి నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశ్రమ నిర్వహణ గురించి వివరించారు. పరిశ్రమ స్థాపనకు అయ్యే మొత్తం ఖర్చులో 25 శాతం ఉద్గారాలను పూర్తిగా తగ్గించే అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి ఖర్చు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. ఇథనాల్ పరిశ్రమపై రైతులు, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే గ్రామస్తులు, రైతులతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, భూగర్భ జలశాఖ అధికారి శ్రీనివాస బాబు, డీఎంహెచ్‌వో రాజేందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీవో అరుణారాణి, అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

థర్డ్ జెండర్ క్లినిక్

- జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు..
- త్వరలో అందుబాటులోకి..
- ప్రతీ మంగళవారం ఓపీ సేవలు
- అవసరాన్ని బట్టి పనిదినాల పెంపు



జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ జెండర్ క్లినిక్

నిర్మల్‌చైన్‌గేట్: స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా క్లినిక్‌లు ఉన్నట్లుగానే.. ట్రాన్స్ జెండర్ల అనారోగ్య సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. నిర్మల్ జనరల్ ఆస్పత్రిలో మైత్రి క్లినిక్ పేరిట ఉచితంగా వైద్య సేవలు అందించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం, వార్డు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించనున్నారు. మైత్రి క్లినిక్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. తాము అనారోగ్యం పాలైతే ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నామని, ధైర్యంచేసి వెళ్లినా అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే వారికోసం ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఓపీ వేళలు..

జిల్లా జనరల్ ఆస్పత్రిలో ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేస్తున్న మైత్రిక్లినిక్‌లో ప్రతీ మంగళవారం ఓపీ సేవలందించనున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డులోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. వైద్యులు రాసి ఇచ్చే మందులకు కూడా ప్రత్యేకంగా సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓపీ సేవలందనున్నాయి.

అవసరం మేరకు పనిదినాలు...

మైత్రి క్లినిక్‌లో ప్రస్తుతానికి ప్రతీ మంగళవారం మాత్రమే సేవలందించనున్నారు. క్లినిక్‌కు వచ్చే వాళ్ల సంఖ్య పెరిగితే.. పనిదినాలు పెంచే అవకాశం ఉంది. జిల్లాలో సుమారు 100 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. గుర్తించని వారుంటే వారికి కూడా సేవలందించనున్నట్లు వైద్యులు తెలిపారు. మైత్రి క్లినిక్‌లో సేవలందించేందుకు ప్రత్యేకంగా వైద్యులను నియమించారు. ఐదుగురు డాక్టర్లను ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఒక గైనకాలజిస్ట్, చర్మ వైద్యుడు, మానసిక వైద్యుడు, జనరల్ ఫిజీషియన్, నర్సు ఉంటారు. వారిని ఎలా రిసీవ్ చేసుకోవాలి.. ఎలా మాట్లాడాలి తదితర విషయాలపై శిక్షణ ఇస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి...



ట్రాన్స్ జెండర్లం ఏదైనా వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లాలంటే ఇబ్బంది పడేవాళ్లం. జ్వరం వచ్చినా ఇతర సమస్యల కోసం వెళితే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మా సమస్యలను ప్రభుత్వం ఆలోచించి ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేయడం సంతోషించదగిన విషయం. క్లినిక్‌లో మెరుగైన వైద్యం అందించాలి.

– భాగ్య సిరి, ట్రాన్స్ జెండర్

మైత్రి క్లినిక్‌ను సిద్ధం చేస్తున్నాం



ట్రాన్స్ జెండర్లకు వైద్య సేవలు అందజేయడానికి జిల్లా జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా క్లినిక్ ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రత్యేకంగా ఓపీ విభాగం, వార్డుతోపాటు వైద్యులు, సిబ్బందిని నియమిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే క్లినిక్ ప్రారంభిస్తాం. ట్రాన్స్ జెండర్లు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ సునీల్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

శోభాయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల



వీడీసీ గణపతికి పూజలు చేస్తున్న ఎస్పీ జానకీషర్మిల

సారంగపూర్: గణపతి నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం నిర్వహించిన గణపతి నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్నారు. స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణపతి మండపంలో ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణపతి నిమజ్జన శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరుపుకోవాలన్నారు. పెద్దపెద్ద డీజేలు ఏర్పాటు చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్, స్థానిక వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలలో ఖాళీగా ఉన్న పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ, యూఆర్ఎస్‌లలోని ఖాళీలను 2023 రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి రోస్టర్ కమ్ మెరిట్ ఆధారంగా భర్తీ చేయడానికి ప్రభుత్వం అనుమతించిందని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలు మరియు 1:3 వెరిఫికేషన్ జాబితా https://deonml.weebly.com లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అర్హులైన 1:3 అభ్యర్థులకు ఫోన్‌కు సమాచారం ఇస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 24న ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలు తీసుకుని ఐడీవోసీ కార్యాలయం రూం నంబర్ 17లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని వివరించారు. కేజీబీవీలలో వివిధ కేటగిరీలలో 30 ఖాళీలకు 16 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. 14 పోస్టులకు అభ్యర్థులు లేనందున క్యారీ ఫార్వర్డ్ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. యూఆర్ఎస్‌లో 1 పోస్టు ఖాళీ ఉండగా, పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



విద్యుత్‌లైన్‌లు సరిచేస్తున్న అధికారులు, సిబ్బంది

దిలావర్‌పూర్: రైతులతోపాటు గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని టీఎస్ ఎన్పీడీసీఎల్ నిర్మల్ డీఈ నాగరాజు అన్నారు. దిలావర్‌పూర్ ఏఈ శ్రీనివాస్‌తో కలిసి శనివారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సమస్యలపై రైతులు ఫిర్యాదు చేయగా, తక్షణమే పరిష్కరించారు. వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా సిబ్బందికి తక్షణమే సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు. వారివెంట లైన్‌మన్ కర్నల్ సంతోష్ , జేఎల్ఎం తిరుపతి, సిబ్బంది గంగన్న, సందీప్ ఉన్నారు.

జీవాలను కాటేసిన కరెంటు

- విద్యుత్‌షాక్‌తో 12 గొర్రెలు మృతి
- కాల్వ వాగు ప్రాంతంలో ఘటన



వాగులో మృతిచెందిన గొర్రెలు

దిలావర్‌పూర్: మేత కోసం అడవిలోకి వెళ్తున్న మూగ జీవాలకు విద్యుత్ తీగ మృత్యుపాశమైంది. కరెంటు షాక్ తగిలి 12 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన మండలంలోని కాల్వ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కుర్మె రాజన్న రోజు మాదిరిగానే తన గొర్రెల మందను మేత కోసం గ్రామ శివారులోని వాగు పరిసర పరివాహక ప్రాంతానికి శనివారం ఉదయం తోలుకెళ్లాడు. అక్కడ వాగులో ఓ రైతు పంటు నీరు పారించేందుకు బిగించిన మోటార్‌కు ఏర్పాటున విదుత్ తీగకు కరెంటు సరఫరా కావడంతో మేత కోసం మోటార్ వద్దకు వెళ్లిన గొర్రెలు షాక్‌కు గురై మృతిచెందాయి. మందను మళ్లించేలోపే 12 గొర్రెలు మృతిచెందాయని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్ ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ.లక్షన్నరకుపైగా ఉంటుందని రాజన్న తెలిపాడు. పరిహారం చెల్లించాలని వేడుకున్నాడు.

రాష్ట్రస్థాయి పోటీలకు సోన్ విద్యార్థులు



విద్యార్థినులతో ఎస్‌వో, ఉపాధ్యాయులు..

సోన్: ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్, సబ్‌జూనియర్ కిక్ బాక్సింగ్ పోటీల్లో సోన్ కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్‌వో లతాదేవి, పీఈటీ ప్రియాంక తెలిపారు. అక్టోబర్ 5, 6వ తేదీల్లో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైన హర్షిణి, సౌజన్య, అక్షయ, కాజల్, అభినయ, వైష్ణవి, త్రిని, అక్షయ, అనసూయను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు.

త్యాగశీలి కొండా లక్ష్మణ్‌బాపూజీ

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించి, మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప త్యాగశీలి తెలంగాణ ఉద్యమకారుడు, స్వతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శనివారం బాపూజీ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పద్మశాలీ కుల సంఘం సభ్యులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం బాపూజీ పోరాడారని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేసి పోరాడిన తీరు మరువలేమన్నారు.

శాలివాహన ప్రతిభా పురస్కారానికి ఎంపిక



సాయన్న

లక్ష్మణచాంద: శాలివాహన విశిష్ట ప్రతిభ పురస్కారానికి మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోతుగంటి సాయన్న ఎంపికయ్యారు. మామడ మండలం పొన్కల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న సాయన్న విద్యారంగానికి చేసిన కృషికి హైదరాబాద్‌కు చెందిన శాలివాహన చారిటబల్ ట్రస్ట్ పురస్కారానికి ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సాయన్న పురస్కారం అందుకుంటారు.

చంపేశారు!?

- రిమ్స్ ఓటీటీ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి
- విషం తాగించి, చితకబాదారని కుటుంబీకుల ఆరోపణ
- మృతదేహంతో రోడ్డుపై బైఠాయింపు
- బంధువుల ఆందోళన


జితేందర్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: చేతికి అందివచ్చిన కుమారుడు కష్టపడి చదివి ప్రయోజకుడు అవుతాడని భావించిన తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. రిమ్స్‌లో బీఎస్సీ ప్రథమ సంవత్సరం ఓటీటీ చదువుతున్న విద్యార్థి శనివారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులతోపాటు బంధువులు ఆందోళనకు దిగారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరైన తీరును చూసి పలువురు కంటతడిపెట్టారు. కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. విద్యార్థి సంఘాలతోపాటు పలువురు మద్దతు ప్రకటించారు. విషం తాగించి, చితకబాదడంతో కుమారుడు మృతిచెందాడని, బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అసలేం జరిగిందంటే..

నార్నూర్ మండలం చోర్‌గావ్‌కు చెందిన ధన్వాస్ రాథోడ్–మీరాబాయి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు జితేందర్ (18) జిల్లా కేంద్రంలోని పిట్టలవాడలో గల ప్రభుత్వ గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో ఉంటూ రిమ్స్‌లో బీఎస్సీ ఓటీటీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబీకులు, స్నేహితులు తెలిపిన వివరాలు..శుక్రవారం రాత్రి 8 గంటలకు వసతి గృహంలో ఉన్న జితేందర్‌కు ఎవరో ఫోన్ చేసి బయటకు రావాలని పిలిచారు. గేటు వద్దకు వచ్చిన ఆయన్ను గుర్తుతెలియని నలుగురు బలవంతంగా వసతిగృహ సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంపైకి తీసుకెళ్లారు. మద్యంలో విషం కలిపి తాగించి, చితకబాదడంతో స్పృహ కోల్పోయాడు. గంట తర్వాత స్పృహలోకి వచ్చి తోటి స్నేహితులు, తన బంధువుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పాడు.


విద్యార్థి సంఘాల రాస్తారోకో

ఊరివాళ్లే..

తమ ఊరికి చెందినవారే కుమారుడిని చంపి ఉంటారని కుటుంబీకులు ఆరోపించారు. ఇటీవల జరిగిన తీజ్ ఉత్సవాల్లో జరిగాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఓ కాలనీలో నివాసం ఉండే వారితో చితకబాది, విషం తాగించారని కుమారుడు చెప్పినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు.

స్నేహితులు అక్కడికి చేరుకుని శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో రిమ్స్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబీకులు శనివారం ఉదయం ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆ విద్యార్థి మృతి చెందాడు.

విద్యార్థులకు రక్షణేది..

వసతి గృహంలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ వద్ద ఏబీవీపీతోపాటు పలు సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్టీ వసతి గృహంలో కనీసం నైట్ వాచ్‌మెన్ లేరని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. హాస్టల్‌కు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుటుంబీకుల ఆందోళన

అనుమానాస్పదంగా మృతిచెందిన ఆ విద్యార్థి కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించకుండా అడ్డుకున్నారు. ఆస్పత్రి వద్ద పెద్దఎత్తున గుమిగూడి ఆందోళన చేపట్టారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి నుంచి బయటకు శవాన్ని తీసుకుచ్చి అంబులెన్స్‌లో పోలీసులు ఎక్కించేందుకు యత్నించగా అడ్డుకున్నారు. కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. బలవంతంగా మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కించిన తర్వాత వాహనాన్ని అడ్డుకున్నారు. బస్టాండ్ ప్రాంతంలో శవంతోపాటు బైఠాయించారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్‌రావులు కుటుంబీకులకు నచ్చజెప్పినా వినకుండా భీష్మించుకూర్చున్నారు. ఇదిలా ఉండగా శనివారం మధ్యాహ్న సమయంలో ఆదిలాబాద్ డీఎస్పీ, రూరల్ సీఐ ఫణిందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తోటి విద్యార్థులను విచారించారు. మృతుడి సోదరుడు అజయ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మావల ఎస్సై తెలిపారు.


కుటుంబీకులకు నచ్చజెప్పుతున్న పోలీసులు

క్లుప్తంగా

వందేభారత్, కేరళ ఎక్స్‌ప్రెస్ మంచిర్యాలలో నిలపాలి


రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ట్రస్మా బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో కేరళ ఎక్స్‌ప్రెస్, వందేభారత్ రైళ్లను నిలపాలని ట్రస్మా ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రామగుండంతో పోల్చితే మంచిర్యాల రైల్వేస్టేషన్ ఐదు, ఆరు రెట్లు కంటే ఎక్కువగా రద్దీ, ఆదాయం సమకూరుతున్న విషయాన్ని దృష్టికి తీసుకువచ్చారు. నవంబర్, డిసెంబర్, జనవరిలో అయ్యప్ప భక్తులు వేలాది మంది మంచిర్యాల మీదుగా శబరికి వెళ్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రయాణికుల సౌకర్యవంతంగా ఉండేలా మంచిర్యాలలో ఈ రైళ్లు ఆపాలని కోరారు. ట్రస్మా జిల్లా, రాష్ట్ర బాధ్యులు కస్తూరి పద్మచరణ్, విష్ణువర్ధన్‌రావు, దుర్గాప్రసాద్, ప్రశీస్ కుమార్, సాధిక్‌పాషా, ఉస్మాన్‌పాషా, థామస్, విక్రమ్‌రావు, బాలమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన మేశినేని శంకర్‌కు చెందిన గేదె పిడుగుపడి మృతిచెందింది. శుక్రవారం ఉదయం మేతకు వెళ్లిన గేదె రాత్రి అయినా తిరిగిరాలేదు. శనివారం ఉదయం వెతకుతుండగా గ్రామశివారులోని చేనులో మృతిచెంది కనిపించింది. దీని విలువ రూ.70 వేలు ఉంటుందని బాధితుడు శంకర్ తెలిపారు. పశువైద్యాధికారి సంపత్, ఆర్‌ఐ విజయలక్ష్మి పంచనామా నిర్వహించారు.

ఆటో బోల్తా..బాలుడి మృతి

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి నందగిరి వసీకర్ (11) మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు..భైంసాకు చెందిన నందగిరి సాయినాథ్ భార్యపిల్లలతో కలిసి తన ఆటోలో శనివారం తానూరు వెళ్తున్నారు. అదే సమయంలో గాలులు వీచి ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. ఒక్కసారిగా బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమారుడు వసీకర్‌ను కుటుంబీకులు భైంసా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

- ఎంపీ గోడం నగేశ్


సురేశ్ మహారాజ్‌తో ఎంపీ నగేశ్, తదితరులు

ఇంద్రవెల్లి: సంస్కృతి సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని ఏమాయికుంట గ్రామంలో శనివారం నిర్వహించిన రుషి పంచమి ఉత్సవాల్లో సాయంత్రం పాల్గొన్నారు. ముందుగా కాలుబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. సురేష్ మహారాజ్ నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని వద్ద మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. మైనింగ్ స్టాఫ్ విధుల్లో జోక్యం చేసుకుంటూ లెక్కపంచే క్రమంలో జోక్యం చేసుకుంటూ తమను ఇబ్బందికి గురిచేస్తున్నారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని తెలిపారు. ఆయన చెప్పినా వారికి, వారు కోరిన పనులకు పురమాయించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. విధుల్లో ఆయన జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. ఈ నిరసనకు సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి శ్రీను మద్దతు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి


ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- భర్త ఫిర్యాదుతో కేసు నమోదు

నిర్మల్‌టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలోని చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని షేక్ సాహెబ్‌పేట్‌కు చెందిన అఫ్రోజ్ అహ్మద్ ఖాన్ తన భార్య ఫర్హనాజ్ (37)కు పురిటినొప్పులు రావడంతో శుక్రవారం మధ్యాహ్నం బస్టాండ్ సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యురాలు..ఆమెను పరీక్షించి సిజేరియన్ ఆపరేషన్ చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ తర్వాత ఆమెకు అధిక రక్తస్రావమైంది. వెంటనే అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు ఆమెను అక్కడికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శనివారం మృతదేహంతో నిర్మల్‌లోని ఆస్పత్రి వద్దకు చేరుకుని భర్త, కుటుంబీకులు, బంధువులు ధర్నా చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సుమారు 5 గంటల వరకు ధర్నా కొనసాగడంతో ట్రాఫిక్ ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రుతుజరెడ్డి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ మహిళ ఘటన స్థలంలో మృతిచెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం..తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన ఎల్మ రాకేశ్‌రెడ్డి, రుతుజరెడ్డిలు ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శనివారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి జైనథ్ మండలంలోని దీపాయిగూడకు బైక్‌పై వెళ్తున్నారు. తిర్పెల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలై రుతుజ (30) ఘటన స్థలంలో మృతిచెందింది. భర్త రాకేశ్‌రెడ్డితోపాటు చిన్న కూతురు (ఏడాదిన్నర వయస్సు గల) టియారాకు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి నాలుగున్నరేళ్ల కూతురు అరుణ్య ఉంది. ఈమేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు రిమ్స్‌కు చేరుకున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

నర్సాపూర్(జి): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం..మండలంలోని గొల్లమాడకు చెందిన పొట్ట గజ్జారాం (70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందినా తగ్గకపోవడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు భైంసా ఏరియాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పెద్ద కుమారుడు రవి ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య సత్తవ్వ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యవసాయ కూలీ మృతి

బేల: మండలంలోని సిర్సన్న రెవెన్యూ గ్రామశివారులోని ఓ చేనులో పిడుగుపాటుకు శనివారం వ్యవసాయ కూలీ రాథోడ్ అవినాష్(22) మృతిచెందాడు. కూలీ పనికి వెళ్లి తిరిగివస్తుండగా సమీపంలో పిడుగుపడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి..

కాసిపేట: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపార. ఆయన కథనం ప్రకారం..మండలంలోని కొండాపూర్ యాపకు చెందిన వెంకటేశ్(32) బుధవారం మల్కెపల్లి శివారులోని పంట చేనులో గడ్డి మందు తాగాడు. కొద్దిసేపటికి ఇంటికి రావడంతో గమనించిన కుటుంబీకులు ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడం, ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇటీవల తీవ్ర మానసిక వేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు మురుగుకాల్వలో పడి..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సుభాష్‌చంద్రకాలనీకి చెందిన మిరిదొడ్డి శంకర్ (56 మురుగుకాల్వలో పడి మృతిచెందాడు. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం..శుక్రవారం రాత్రి ఇంటి పని నిమిత్తం సైకిల్‌పై మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా మురుగుకాల్వలో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం మురుగుకాల్వలో పడి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య తార ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలి

- హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్‌గా రూ.10 వేలు చెల్లించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీపీపీ హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రకటించిన లాభాల బోనస్‌ను ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మి కులకు వర్తింపజేయాలన్నారు. యాజమాన్యం ఏటా ఎస్టీపీపీ నుంచి వేలకోట్ల లాభా లు ఆర్జిస్తునప్పటికి రాత్రింబవళ్లు విద్యుత్ ఉత్పత్తికి కష్టపడుతున్న కార్మికులకు ఎలాంటి బోనస్ చెల్లించకపోవడం బాధాకరమన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ప్రకటించిన రూ.5వేల బోనస్‌ను పవర్ ప్లాంటు కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు నవీన్, ఎండీ.హజార్‌పాషా, అంజి, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ దేవయ్య

బెల్లంపల్లి: ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్ఓ దేవయ్య తెలిపారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. వినాయక నిమజ్జనం రోజున బెల్లంపల్లి హన్మాన్ బస్తీకి చెందిన వేల్పుల శ్రావణ్‌పై ఈనెల 16న రాసబత్తుల గణేశ్(బెల్లంపల్లి), గుగ్గస్ శ్రీనివాస్ (మహారాష్ట్ర) అలియాస్ రామటెంకి శ్రీనివాస్ కత్తితో దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటనలో శ్రావణ్‌కు గాయాలయ్యాయని, పాత కక్షల కారణంగానే దాడి జరిగినట్లు ఎస్‌హెచ్ఓ వివరించారు. ఈమేరకు నిందితులిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రోద్బలంతోనే భవనం కూల్చివేత

- ఇంట్లోనే రూ.20లక్షల నగదు, 30 తులాల బంగారం
- త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తాను
- టీబీజీకేఎస్ మాజీ నాయకుడు దీకొండ అన్నయ్య



మాట్లాడుతున్న దీకొండ అన్నయ్య

నస్పూర్: తన భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నా రాజకీయ ప్రోద్బలంతోనే అధికారులు కూల్చివేశారని టీబీజీకేఎస్ మాజీనాయకుడు దీకొండ అన్నయ్య ఆరోపించారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో న స్పూర్ శివారు సర్వేనంబర్ 40/2లో 350 గజాలను పొనుగంటి ప్రేమలత వద్ద నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించానని తెలిపారు. 2021లో మున్సిపల్ పర్మిషన్ తీసుకుని ఇంటిని నిర్మించినట్లు పేర్కొన్నారు. 2023లో అధికారులు ఇంటి నంబర్ కేటాయించగా రూ.34,330 ఇంటి పన్ను చెల్లించానన్నారు. 2022లో నోటీసులు జారీ చేసినప్పుడు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. గత జూన్‌లో, 15 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారని కమిషనర్ సతీశ్ అనడం అవాస్తవమన్నారు. ఇంటిని కూల్చే ముందు సామగ్రి తీసుకునే సమయం ఇవ్వలేదన్నారు. పోలీసులు తనను, కుమారుడు, కుటుంబ సభ్యులను బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కి తరలించారని ఆరోపించారు. దళితుడి అయిన తనపై రాజకీయకక్ష సాధింపులో భాగంగా రూ.2. కోట్లు విలువ గల భవనాన్ని నేల మట్టం చేశారని ఆరోపించారు. ఇంట్లోనే రూ.20 లక్షల నగదు, 30 తులాల బంగారు ఆభరణాలు, స్టడీ సర్టిఫికేట్లు, డాక్యుమెంట్లు, రూ 60 లక్షలు విలువ చేసే సామగ్రి ఉండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. సమావేశంలో అన్నయ్య కుమారుడు నవీన్‌కుమార్, అల్లుళ్లు రాజ్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

లాభాల వాటా పంపిణీలో అన్యాయం


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన వాస్తవ లాభాల్లో నుంచి వాటా పంపిణీలో కార్మికులకు అన్యాయం జరుగుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. వాస్తవ లాభాల్లో నుంచి 33 శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణికి రూ.4,071 కోట్ల లాభాలు వస్తే రూ.2,412 కోట్లలో 33 శాతం లాభాలు పంపిణీ చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ మామూళ్ల కింద రూ.2,289 కోట్లు పక్కన పెట్టిందని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా, టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్నప్పుడు వాస్తవ లాభాల్లో నుంచి పెట్టుబడి పేరిట కోత విధించలేదని గుర్తుచేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి కార్మికులకు నష్టం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఇదివరకు జరిగిన ఒప్పందం మేరకే కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటాలో రూ.5 వేలు ఇస్తున్నారని తెలిపారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రాంమూర్తి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటరమణ, నాయకులు రవీందర్, రాజశేఖర్, బడికెల సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐలో చోరీకి యత్నించిన దొంగల అరెస్టు

- వారం రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

ముథోల్: మండల కేంద్రంలోని ఎస్బీఐలో ఈనెల 13న చోరీకి యత్నించిన దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో సీఐ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పాత బస్టాండ్ సమీపంలో గల ఎస్బీఐ వెనుకభాగంలో వెంటిలేటర్‌కు ఉన్న ఇనుపచువ్వలు తొలగించి చొరబడ్డారు. సీసీ కెమెరాలు, అలారం వైర్లు కత్తిరించి చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బందితో కలిసి రెండు టీంలు ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేశారు. సీసీపుటేజీలను పరిశీలించారు. ముథోల్‌కు చెందిన షేక్ మోసిన్ అహ్మద్, మమ్మద్ ఇర్ఫాన్ ఉద్దీన్‌లను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులను సీఐ అభినందించారు. అనంతరం సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్‌లను ఎస్బీఐ మేనేజర్ వి.గిరి సన్మానించారు.

పార్కు కాదు.. కోనేరు




బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం. అధికారుల నిర్లక్ష్యంతో కోనేరు వ్యర్థాలతో నిండి కంపుకొడుతోంది. చెత్తాచెదారం కోనేరు పక్కనే వేసి కాల్చివేస్తున్నారు. దీంతో పొగతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇక కోనేరు నిండా.. నాచు, పిచ్చిమొక్కలు పెరగడంతో ఇలా పచ్చగా కనిపిస్తోంది. బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని మహిళలు బతుకమ్మలను ఆలయం కోనేటిలోనే నిమజ్జనం చేస్తారు. మిగతా రోజుల్లో కోనేటిని ఎవరూ పట్టించుకోరు. దీంతో ఇలా గుర్రపుడెక్కతో నిండియుంది. ఏటా గంగపుత్రులతో పుష్కరిణిని శుభ్రం చేయిస్తారు. గతేడాది శుభ్రం చేయించిన డబ్బులు పూర్తిగా చెల్లించకపోవడంతో ఈసారి శుభ్రం చేయడానికి వారు రావడం లేదని తెలిసింది. బతుకమ్మ పండుగ నేపథ్యంలో కోనేరు శుభ్రం చేయించాలని పట్టణ మహిళలు కోరుతున్నారు.